సాక్షి
ఖమ్మం

సోమవారం । 21 । ఆగస్టు । 2023



డిజిటల్‌లో వ్యవసాయ కమతం!

వ్యవసాయ కమతాల గణనను ఈ ఏడాది పూర్తిగా డిజిటల్‌లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



మున్నేరుపై 3 చెక్‌డ్యామ్‌లు

ఖమ్మం నగరంలోని మున్నేరుపై మూడు చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

స్తంభాద్రి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం(గుట్ట)లో 16వ వార్షిక పవిత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6:30 గంటలకు మంగళవాయిద్యాలతో అర్చకులు వేడుకలకు అంకురార్పణ చేయగా, విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, వాస్తుపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

లోకేష్ యాదవ్‌కు ఓయూ డాక్టరేట్



లోకేష్ యాదవ్

వైరా : ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగంలో గంగదేవుల లోకేష్ యాదవ్ డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని చరిత్ర విభాగంలో ప్రొఫెసర్ ఎం. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కల్చర్ అండ్ టూరిజం ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన పూర్తిచేసి సమర్పించిన గ్రంథాన్ని పరిశీలించిన ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు చరిత్రలో పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. వైరా మండలం సిరిపురం (కేజీ) గ్రామానికి చెందిన లోకేష్‌యాదవ్‌కు డాక్టరేట్ లభించటం పట్ల గ్రామస్తులు, ఆయన స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లోకేష్ యాదవ్ మాట్లాడుతూ తన పరిశోధనకు సహకరించిన ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరావు, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీంద్రయాదవ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మారెమ్మగుడికి ఆర్టీసీ బస్సు

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో గల మారెమ్మతల్లి ఆలయానికి బస్సు సౌకర్యం లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఆదివారం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించారు. ఈ మేరకు జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

ఇక మత్స్యసిరి !

- జలాశయాల్లో చేపపిల్లలు పోసేందుకు సిద్ధం
- ఈ ఏడాది రూ.4.40 కోట్ల విలువైన 3.62 కోట్ల పిల్లలు
- జిల్లాలో 903 జలాశయాల గుర్తింపు
- కొనసాగుతున్న సీడ్ ఫామ్స్ పరిశీలన



సీడ్ ఫాం వద్ద చేప పిల్లలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: జలాశయాల్లో చేప పిల్లలు పోసేందుకు రంగం సిద్ధమైంది. సమృద్ధిగా కురిసిన వర్షాలతో జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లు నిండుకుండల్లా మారాయి. దీంతో మత్స్యశాఖ అధికారులు జలాశయాల్లో చేప పిల్లలు వదిలే ప్రక్రియపై దృష్టి సారించారు. జిల్లాలోని 903 జలాశయాల్లో చేప పిల్లలను పోయాలని నిర్ణయించారు. జలాశయాల విస్తీర్ణం ఆధారంగా అవసరమైన 3.62 కోట్ల చేప పిల్లలకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. పిల్లల టెండర్లలో ఐదుగురు కాంట్రాక్టర్లు పాల్గొనగా, నేలకొండపల్లి మండలం నాచేపల్లి, కల్లూరు మండలం లోకారం, బోనకల్ మండలం కలకోటకు చెందిన సీడ్ ఫామ్ నిర్వాహకులు దక్కించుకున్నారు.

903 చెరువుల్లోకి చేపపిల్లలు

ఈ ఏడాది జిల్లాలో 903 చెరువులు, రిజర్వాయర్లలో చేపలను పెంచాలని మత్స్యశాఖ నిర్ణయించింది. ఈ మొత్తంలో నాలుగు రిజర్వాయర్లు కాగా, 125 పెద్ద చెరువులు, మిగిలినవి చిన్న చెరువులు ఉన్నాయి. పెద్ద చెరువుల్లో పెద్ద పిల్లలను పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. పెద్ద చేప పిల్లల రకాల్లో కట్ల, రోహు, మృగాలు ఉండగా, చిన్న చేప పిల్లల్లో కట్ల, రోహు, బంగారు తీగ రకాలు ఉన్నాయి.

త్వరలోనే విడుదల..

మరికొద్ది రోజుల్లో రాష్ట్ర మత్స్యశాఖ సీడ్ రిలీజింగ్ ఆర్డర్లను ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు జిల్లా అధికారులు భావిస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో సీడ్ ఫామ్స్ పరిశీలన, కాంట్రాక్టర్లకు కేటాయింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం చేప పిల్లల సరఫరాకు ఆర్డర్ ఇస్తే వర్షాలను పరిగణనలోకి తీసుకుని జలాశయాల్లోకి చేపపిల్లలను వదిలే అవకాశం ఉంది. గత ఏడాది టెండర్ల ప్రక్రియలో జాప్యం జరిగింది. దీంతో చెరువుల్లో చేపలను వదలడంలో కూడా బాగా ఆలస్యమైంది. దీంతో నిర్ణీత సమయానికి చేపలు తగిన సైజు, బరువు రాకపోవడంతో మత్స్యకారులు నష్టపోయారు. ఆయా అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది జాప్యం జరగకుండా టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేశారు. ఈనెలాఖరు నాటికి చేప పిల్లను చెరువుల్లో వదలడం ప్రారంభించి సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో మత్స్యశాఖ అధికారులు ఉన్నారు.

రెండు సైజుల్లో పిల్లలు

ఏటా మాదిరిగానే చెరువుల స్థాయిని బట్టి రెండు సైజుల్లో ఉన్న పలు రకాల చేప పిల్లలను వదిలేలా మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. చిన్న చేప పిల్లలు 35 – 40 మి.మీ., పెద్ద చేప పిల్లలు 80 – 100 మి.మీ. చొప్పున ఉంటాయి. చిన్న పిల్లలు ఒక్కొక్కటి రూ.0.58, పెద్ద చేప పిల్లకు రూ.1.58 చొప్పున ధర నిర్ణయించారు. ఈ మేరకు 1.33 కోట్ల చిన్న చేపపిల్లలకు గాను రూ.77,25,548, 2.29 కోట్ల పెద్ద సైజ్ చేపపిల్లలకు రూ.3,62,85,405గా ధర ఖరారైంది. మొత్తం 3.62 కోట్ల పిల్లలకు రూ.4,40,10,953 చెల్లించాల్సి ఉంటుంది.

మత్స్యకారులకు ప్రయోజనం కలిగేలా..



మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జలాశయాల్లో చేప పిల్లలను వదిలేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రాష్ట్ర మత్స్యశాఖ అలాట్‌మెంట్లు, సరఫరా ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. వాన, వరదలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు చేప పిల్లలను జలాశయాల్లో వదులుతాం.

– డి.ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

నేటి నుంచి ఎంఈఎస్‌ల పర్యటన

- కేంద్ర, రాష్ట్ర అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన
- నాలుగు బృందాలు, 20 మంది సభ్యులు

ఖమ్మం సహకారనగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాల అమలు, వాటి విధి విధానాలు తెలుసుకునేందుకు మిలిట్రీ ఇంజనీర్ సర్వీసెస్(ఎంఈఎస్) బృందం సోమవారం నుంచి ఈనెల 26వరకు జిల్లాలో పర్యటించనుంది. పర్యటన అనంతరం బృందం సభ్యులు జిల్లాలోని పరిస్థితులపై సమగ్ర వివరాలు సేకరించనున్నారు. వీరు పదోన్నతుల్లో భాగంగా ఇప్పటికే ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ(మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ) హైదరాబాద్‌లో శిక్షణ పొందుతుండగా.. విలేజ్ ప్రోగ్రాం పేరుతో గ్రామస్థాయిలో ఆరు రోజుల పాటు శిక్షణ పొందనున్నారు. ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యుల చొప్పున నాలుగు టీమ్‌లు జిల్లాలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో ఉంటూ వివరాలు సేకరించనున్నారు. బృందానికి జిల్లా నోడల్ అధికారిగా డీఆర్‌డీఓ విద్యాచందన వ్యవహరిస్తారు. మండలానికి ఒక లైజన్ ఆఫీసర్, సపోర్టింగ్ అధికారిగా ఒక్కొక్కరు ఉంటారు.

శిక్షణ ఇక్కడే...

తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం, కామేపల్లి మండలం ముచ్చర్ల, కొమ్మినేపల్లి, తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామాల్లో ఈ బృందం పర్యటించనుంది. ఆరు రోజుల పాటు గ్రామంలోనే ఉండి పథకాల అమలు, అక్కడి స్థితిగతులపై అవగాహన చేసుకోనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరి శీలించి గ్రామస్తులతో పలు అంశాలపై మాట్లాడతా రు. ఈ మేరకు సోమవారం జిల్లాకు రానున్న సభ్యులు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలుస్తారు. ఆరు రోజుల శిక్షణ తర్వాత తిరిగి 26న కలెక్టర్‌ను కలిసి తాము పరిశీలించిన అంశాలను కలెక్టర్‌తో చర్చిస్తారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

నేడు ముసాయిదా జాబితా ప్రచురణ



ఖమ్మం సహకారనగర్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నారు. జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటించగా స్పెషల్ సమ్మర్ రివిజన్ కింద ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత కొత్తగా నమోదు, మరణించిన వారి ఓట్లు తొలగింపు, అడ్రస్‌ల మార్పు చేశారు. కాగా, మరోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తూ 21న(నేడు) ముసాయిదా జాబితా ప్రచురించనున్నారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలపడంతో పాటు కొత్తగా నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు.

జిల్లాలో 11,77,687మంది ఓటర్లు..

ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కలిపి 11,77,687 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 5,73,406 మంది, మహిళలు 6,04,203, ఇతరులు 78 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 30,797 మంది అధికంగా ఉన్నారు. నేటి నుంచి కొత్త ఓటర్ల నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుండగా, బూత్‌స్థాయిలో సైతం నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు జాబితాలోని అభ్యంతరాలపై ఈనెల 21 నుంచి సెప్టెంబర్ 19 వరకు అవకాశం ఉంది. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం స్పెషల్ డ్రైవ్ కింద ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీలను కేటాయించారు. అనంతరం అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,51,775	1,62,576	46	3,14,,397
పాలేరు	1,10,373	1,17,083	06	2,27,462
మధిర	1,04,399	1,10,229	08	2,14,636
వైరా	92,887	96,468	08	1,89,363
సత్తుపల్లి	1,13,972	1,17,847	10	2,31,829
మొత్తం	5,73,406	6,04,203	78	11,77,687



లక్కు ఎవరికి దక్కునో..?

- 122 మద్యం దుకాణాలకు నేడు డ్రా
- ఇప్పటికే ఖమ్మంలో మకాం వేసిన ఆంధ్రా వ్యాపారులు
- సిండికేట్లపై రెండు రోజులుగా జోరుగా చర్చలు



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆదర్శ్ సురభి

ఖమ్మంక్రైం : నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా ఈనెల 4 నుంచి 18 వరకు జిల్లాలోని 122 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించారు. మద్యం దుకాణాల కేటాయింపునకు ఖమ్మం సీక్వెల్ రిసార్ట్స్‌లో సోమవారం డ్రా తీయనున్నారు.

7,207 దరఖాస్తులు..

జిల్లాలో 122 మద్యం దుకాణాల కోసం 7,207 దరఖాస్తులు అందాయి. దీంతో ఎక్సైజ్ శాఖకు రూ.144 కోట్ల మేర ఆదాయం లభించిన విషయం విదితమే. గత సంవత్సరం 6,212 దరఖాస్తులు కాగా, ఈసారి అదనంగా 955 దరఖాస్తులు వచ్చాయి. దీంతో మద్యం దుకాణాలు తమకే దక్కాలంటూ కొందరు ఇష్టదైవాలను వేడుకుంటుండగా, మరి కొందరు ఏకంగా పూజలే చేయిస్తున్నారు.

ఏపీ వ్యాపారుల మకాం..

మద్యం దుకాణాల కేటాయింపునకు సోమవారం డ్రా ప్రక్రియ ఉండడంతో ఏపీ నుంచి కూడా భారీగానే దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. వారంతా శనివారం నుంచే ఖమ్మంలో మకాం వేసి, స్థానిక వ్యాపారులతో సిండికేట్ కోసం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈసారి కొత్తవారు సైతం దుకాణాల కోసం పోటీ పడి దరఖాస్తు చేయడంతో.. వారికి మంచి దుకాణాలు దక్కితే నయానో, భయానో వారి నుంచి షాపులు దక్కించుకోవాలని మరికొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చేది ఎన్నికల సీజన్ కావడంతో ఎంత ఖర్చయినా పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది.

దరఖాస్తుదారులకే అనుమతి..

మద్యం దుకాణాలకు డ్రా తీసే రిసార్ట్స్ లోకి దరఖాస్తు వేసిన వారిని మాత్రమే అనుమతిస్తామని వెంట వచ్చేవారు బయట ఉండాల్సిందేనని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి తెలిపారు. నేడు ఉదయం 10గంటలకు కలెక్టర్ గౌతమ్ డ్రా తీస్తారని చెప్పారు.

డ్రా ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్

మద్యం దుకాణాల కేటాయింపునకు డ్రా తీసే సీక్వెల్ రిసార్ట్స్‌ను మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదివారం రాత్రి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డ్రా ప్రక్రియకు వ్యాపారులు అత్యధికంగా హాజరయ్యే అవకాశం ఉన్నందున ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఏసీపీ గణేష్, ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ రాజు తదితరులు ఉన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంఅర్బన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం సువర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకే గోదావరి పుణ్య జలాలతో అంతరాలయంలో మూలవరులకు అభిషేకం జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణమూర్తులను చిత్రకూట మండపంలో వేంచేయింపజేసి వైభవంగా నిత్య కల్యాణం గావించారు. అంతకుముందు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం తదతర పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సారె సమర్పణ

పాల్వంచరూరల్: శ్రావణ మాసం సందర్భంగా పెద్దమ్మతల్లికి భక్తులు సారె సమర్పించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, తలనీలాలు, చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు విశేష పూజలు నిర్వహించి సారెను సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద ఆదివారం గోదావరి నీటిమట్టం 21.7 అడుగులకు చేరుకుంది. గడిచిన కొన్ని రోజులుగా గోదావరి నీటిప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. గడిచిన రెండు రోజులుగా రాష్ట్రంలో పలుచోట్ల కురిసిన వర్షాలతో గోదావరిలోకి వరద వస్తోందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి గోదావరి నీటి మట్టం 15.6 అడుగులు ఉండగా, ఆదివారం రాత్రి 21.7 అడుగులకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

అటు ఆపద.. ఇటు అవస్థ

- పింఛన్ కోసం కిడ్నీ బాధితుల ఎదురుచూపులు
- మందులు, ప్రయాణ ఖర్చులు కూడా అందని వైనం
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బాధితులు



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ విభాగం

ఖమ్మం వైద్యవిభాగం: ఉమ్మడి జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ.. వ్యయప్రయాసలకోర్చి కొందరు సుదూర ప్రాంతాల్లోని డయాలసిస్ కేంద్రాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. కానీ జిల్లాలో ఉన్న వేల మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మాత్రం సరిపడా డయాలసిస్ కేంద్రాలు అందుబాటులో లేవు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డయాలసిస్ సెంటర్లు మొత్తం 9 మాత్రమే ఉండగా.. వాటిలో 516 మంది బాధితులు రిజిస్టర్ చేసుకున్నారు. కొంత మంది అవకాశం లేక ఇతర జిల్లాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆర్థిక స్తోమత లేక ఊరు దాటి వెళ్లలేని వారు డయాలసిస్ చేయించుకోకుండానే తనువు చాలిస్తున్నారు. కాగా, ప్రభుత్వ పరంగా డయాలసిస్ కేంద్రాలు ఖమ్మం, సత్తుపల్లిలో ఉండగా.. ప్రైవేట్‌గా మమత, శ్రీరక్ష ఆస్పత్రుల్లో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు చాలా వరకు పేదలే కాగా, ప్రభుత్వం ఇచ్చే రూ. 2వేలు పింఛన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థికంగా భారమే..

సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు రెండు, మూడు గంటలు ప్రయాణం చేయటం.. సుమారు నాలుగు గంటల పాటు పడకపై డయాలసిస్ చేయించుకోవడం.. ఆతర్వాత తిరిగి ప్రయాణం చేయాల్సి రావడంతో వారు నీరసించి ఏ పనీ చేయడానికి అవకాశం లేకుండా పోతోంది. ఇలా వారంలో రెండు, మూడుసార్లు ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం బాధితులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నా.. అందాల్సిన మందులు, రవాణా ఖర్చులు మాత్రం చెల్లించట్లేదు. కాగా, ఉమ్మడి జిల్లాలో డయాలసిస్ చేయించుకునే వారిలో సగం మందికి పింఛన్ అందట్లేదని సమాచారం. చాలా కాలంగా డయాలసిస్ చేయించుకునే వారికి అందుతుండగా.. గతేడాది నుంచి వారి పేర్లు ఆరోగ్యశ్రీ సిబ్బంది నమోదు చేయకపోవటంతో వారికి పింఛన్ అందడం లేదు. దీనికి తోడు డయాలసిస్ కేంద్రాల్లో రోగులకు టిఫిన్, స్నాక్స్ అందించాలనే నిబంధన ఎక్కడా అమలు కావట్లేదు. సగం మందికి బస్‌పాస్‌లు కూడా లేవు.

ఖమ్మం కేంద్రంలో మరణ మృదంగం..

ఖమ్మం ప్రభుత్వ డయాలసిస్ కేంద్రంలో కొన్ని రోజులుగా డయాలసిస్ బాధితులు మృతి చెందడం కలకలం రేపుతోంది. వారికి సేవలు అందించటంలో కేంద్రం నిర్వాహకులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని కేంద్రాన్ని దీప్‌చంద్ డయాలసిస్ సెంటర్ అనే సంస్థకు ఈ ఏడు జూన్ 22న ఐదేళ్లపాటు లీజుకు ఇచ్చారు. కాగా సెంటర్ నిర్వహణ తీసుకొని రెండు నెలలు గడవక ముందే ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటున్న 13 మంది రోగులు మృత్యువాత పడటం కలవరపెడుతోంది. దీంతో సెంటర్‌కు చెల్లింపులు చేసే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు, ఆస్పత్రి అధికారులు నిర్వాహకులపై సీరియస్ అయ్యారు. రోగుల మృతికి కారణాలు తెలియజేయాలని నోటీసులు కూడా ఇచ్చారు. కాగా, డయాలసిస్ సెంటర్ నిర్వాహకులు మాత్రం తమ తప్పులేదని, ఇతర అనారోగ్య కారణాలతో సెంటర్‌లో ఐదుగురు మాత్రమే మృతి చెందారని చెబుతున్నారు. మిగితా వారు ఇంటి వద్దే చనిపోయారని, ఆ మృతులకు తమకు ఏమాత్రం సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు.

పింఛన్, బస్‌పాస్ ఇప్పించండి..



ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నా. కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేయించుకోవాల్సి ఉండటంతో ఏ పనీ చేయలేక పోతున్నాను. కొత్తగూడెంలో ఖాళీ లేక వారానికి మూడుసార్లు డయాలసిస్ కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నా.. మందుల ఇవ్వకపోవడంతో నెలకు రూ.3వేల నుంచి రూ.4వేలు వెచ్చించాల్సి వస్తోంది. ప్రయాణ ఖర్చులు కూడా భారంగానే ఉంది. బస్‌పాస్, పింఛన్ మంజూరు చేస్తే భారం తగ్గుతుంది.

– ఎం.డీ.సలీం, కొత్తగూడెం

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



ఆస్పత్రిలోని డయాలసిస్ కోసం వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఇటీవల కొందరు మృతి చెందిన విషయం తమ దృష్టికి వచ్చింది. అయితే, వారిలో చాలామంది ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాం. ఇకపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. అలాగే, ఎయిడ్స్ బాధితులకూ డయాలసిస్ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం.

– బి.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

నేటి నుంచి హెచ్‌ఎంలకు శిక్షణ

రెండు విడతలుగా కార్యక్రమం

ఖమ్మం సహకారనగర్ : ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ఉద్దేశించిన 'ఉన్నతి, 10వ తరగతి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక' కార్యక్రమాలపై నేటి నుంచి ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు,, మోడల్, రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీల హెచ్‌ఎంలు, ప్రత్యేకాధికారులకు ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం నుంచి రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కేటాయించిన తేదీల్లో ఆయా హెచ్‌ఎంలు హాజరు కావాలని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. శిక్షణ కాలంలో ఇతర అవసరాల కోసం సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ కోర్స్ డైరెక్టర్‌గా, డీసీఈబీ సెక్రటరి నారాయణ అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని, హైదరాబాద్‌లో ఇప్పటికే శిక్షణ పొందిన ఐదుగురు గెజిటెడ్ హెచ్‌ఎంలు రిసోర్స్ పర్సన్లుగా ఉంటారని వివరించారు. 21 నుంచి 23 వరకు మొదటి విడతలో ఖమ్మం డివిజన్‌లోని ఖమ్మం అర్బన్, రూరల్, కామేపల్లి, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, రఘునాథపాలెం, సింగరేణి, తిరుమలాయపాలెం మండలాల ప్రధానోపాధ్యాయులు, 24 నుంచి 28 వరకు రెండో విడతలో మధిర డివిజన్ పరిధిలోని మధిర, బోనకల్, చింతకాని, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, వైరా, ఎర్రుపాలెం మండలాల హెచ్‌ఎంలు హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు.

క్లుప్తంగా

పొంగులేటి విస్తృత పర్యటన


వధూవరులను ఆశీర్వదిస్తున్న పొంగులేటి

ఖమ్మంరూరల్: టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలోని రెడ్డిపల్లి, ముత్తగూడెం గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. రెడ్డిపల్లిలో ఓ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముత్తగూడెం సర్పంచ్ గోనే భుజంగరెడ్డి ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకోగా ఆయనను పరామర్శించారు. పోలేపల్లిలో ఓబాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. పొంగులేటి వెంట కాంగ్రెస్ నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, క్లెం వెంకటరెడ్డి, ఎ.అశోక్‌నాయక్, సూదగాని ఉపేందర్, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నృత్యంలో ప్రతిభ చూపిన బాలికకు అవార్డు


పురస్కారంతో మాన్వి

ఖమ్మంఅర్బన్: శివుడి పాటకు నృత్యం చేసి పురస్కారం దక్కించుకుంది ఖమ్మానికి చెందిన వైద్య దంపతుల కుమార్తె. మమత ఆస్పత్రి దంత కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అనితారావు దంపతుల కుమార్తె మాన్వి ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో వేఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ ప్రైడ్ అవార్డ్స్–2023 వేడుకల్లో శివుడి పాటకు నృత్యం చేసింది. అందుకు గాను ఆమెకు నిర్వాహకులు అవార్డు అందించారు. గురువు లక్ష్మీనారాయణ వద్ద ఆమె శిక్షణ తీసుకుంటోంది.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్ల చెరువు రోడ్డులో కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎనిమిది మంది కలిసి కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఆరు కోళ్లు, 11 ద్విచక్రవాహనాలు, రూ.21 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ తోలుతుండగా గుండెపోటు

వైద్యశాలకు తరలిస్తుండగా మృతి

నేలకొండపల్లి: ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తికి గుండెనొప్పి రాగా.. వైద్యశాలకు తరలిస్తున్న సమయంలో మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గోగుల పుల్లయ్య (50) ఆదివారం వరిగడ్డి తోలేందుకు ముదిగొండ మండలంలోని కమలాపురం వైపు వెళ్లారు. అక్కడికి వెళ్లగానే ఒక్కసారిగా గుండెలో నొప్పిగా ఉందని స్పృహతప్పి పడిపోయాడు. పక్కనే ఉన్నవారు బైక్‌పై నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దకు కుమారులున్నారు.

ఇరు వర్గాల పరస్పర దాడులు

నేలకొండపల్లి: దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన దంపతుల మధ్య ఆదివారం రాత్రి తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. భార్యపై భర్త చేయిచేసుకోవడంతో ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. విషయం తెలుసుకున్న భర్త, భార్య తరఫు బంధువులు ప్రధాన సెంటర్‌లో పరస్పర దాడులు చేసుకున్నారు. బాధితురాలి తరఫున బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తల్లిని చంపిన తనయుడి అరెస్ట్..

ఇల్లెందు: మండలంలోని బొజ్జాయిగూడెం పంచాయతీ మోదుగులగూడెం గ్రామానికి చెందిన మెరుగు పద్మను ఆమె కొడుకు యాకయ్య ఆస్తి కోసం తాగిన మైకంలో రోకలి బండతో మోదీ హతమార్చాడని ఆదివారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో సీఐ టి.కరుణాకర్ తెలిపారు. ఈ నెల 18న పద్మ కుమారుడు యాకయ్య తాగిన మైకంలో ఇంటికొచ్చి తల్లితో ఘర్షణ పడ్డాడు. ఆస్తి అమ్మి తనకు ఇస్తే ఇసన్నపేటలో తాను నివాసం ఉంటున్న చోట ఇంటి నిర్మాణం చేసుకుంటున్నానని, ఖర్చులకు డబ్బులు కావాలని ఒత్తిడి చేశాడన్నారు. అయితే పద్మ ఒప్పుకోకపోవడంతో ఆగ్రహంతో రోకలి బండతో తల మీద బలంగా మోదగా.. పద్మ అక్కడిక్కడే మృతి చెందిందని చెప్పారు. గత ఏడాది కాలంగా ఆస్తి కోసం తల్లి మీద ఒత్తిడి పెంచాడని, తోబుట్టువులైన కుమార్తెలకు తన సంపాదన అందుతుందని కుమారుడికి చెందడం లేదని తీవ్ర ఆగ్రహంతో భార్యతో పాటు ఒకరిద్దరు అడ్డు వచ్చినా ఆగకుండా యాకయ్య తల్లి వధించాడని పేర్కొన్నారు. తల్లిని చంపానని నిందుతుడు ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయాడని, విచారించిన పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డిజిటల్‌లో వ్యవసాయ కమతం!

గ్రామాలు, కులాల వారీగా భూముల లెక్కింపు

- భూరికార్డులు, ధరణి డేటా ఆధారంగా గణన
- లెక్కల్లో నిమగ్నమైన వ్యవసాయ, ప్రణాళిక శాఖల అధికారలు
- మూడు దశల్లో కొనసాగనున్న నిర్వహణ



ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ కమతాల గణనను ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నారు. ఐదేళ్లకోసారి జరిగే వ్యవసాయ కమతాల గణన చివరగా 2015లో జరిగింది. 2021–22లో చేయాల్సి ఉన్నా కరోనా కారణంగా వాయిదా పడడంతో ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. గతంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యాన ఈ గణన చేపట్టగా ఈసారి వ్యవసాయ, ప్రణాళిక శాఖలకు అప్పగించారు. ప్రధానంగా రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓల వ్యవస్థ లేకపోవడం ఈ మార్పునకు కారణమని తెలుస్తోంది. అలాగే, వ్యవసాయ శాఖలో వ్యవసాయ విస్తర్ణాధికారులు (ఏఈఓ) ఉండటం, భూములు, పంటలపై వారికి అవగాహన ఉండటంతో ఈ బాధ్యత వారికి ఉన్నతాధికారులు అప్పగించినట్లు చెబుతున్నారు.

ఈసారి ఆన్‌లైన్..

గతంలో వ్యవసాయ కమతాల గణన మాన్యువల్ విధానంలో జరిగింది. సాంకేతిక వ్యవస్థ అభివృద్ధి చెందటంతో దాన్ని అందిపుచ్చుకొని డిజిటల్ విధాంలో ప్రస్తుత గణనను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా కమిటీని నియమించారు. జిల్లాలో ఉన్న 129 మంది వ్యవసాయ విస్తర్ణాధికారుల(ఎన్యూమరేటర్లు) ద్వారా ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా, మండల ప్రణాళిక గణాంక అధికారి పర్యవేక్షిస్తారు. అలాగే, ఏఓ మండల చార్జ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. అక్కడి నుంచి జిల్లాస్థాయిలో ముఖ్య ప్రణాళిక అధికారి, ఆపై రాష్ట్ర ప్రణాళిక అధికారికి వివరాలు చేరవేస్తారు. మొత్తంగా మూడు దశల్లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గణనలో రైతులకు చెందిన వ్యవసాయ భూములతో పాటు ప్రభుత్వ, బంజరు, అటవీ భూములేకాక సాగుకు అనువుగా లేని భూముల వివరాలు సేకరిస్తారు. ప్రస్తుత లెక్కల ప్రకారం జిల్లాలో 3.30 లక్షల మంది రైతులకు చెందిన 7.20 లక్షల ఎకరాల భూమి ఉన్నట్లు సమాచారం.

మూడు దశల్లో గణన

వ్యవసాయ కమతాల గణనను మూడు దశల్లో నిర్వహించాలని ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. మొదటి దశలో కులాలు, స్త్రీ, పురుషుల వారీగా సర్వే నంబర్లు, ఖాతా నంబర్ల వారీగా పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో 20 శాతం శాంపిల్ సర్వేలను చేయాల్సి ఉంటుంది. రైతులు ఏఏ పంటలు సాగు చేస్తున్నారు.. విత్తనాల వివరాలు.. నీటి పారుదల వివరాలను ఈ సర్వేలో గుర్తించాల్సి ఉంటుంది. మూడో దశలో 7 శాతం శాంపిళ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. పురుగుమందులు ఎంత మోతాదు వినియోగిస్తున్నారు.. ఎరువుల వినియోగం ఎలా ఉంది.. సేంద్రియ ఎరువుల వినియోగం ఏ మేరకు ఉంది.. పంట దిగుబడులు ఎలా ఉన్నాయి.. మార్కెట్ సౌకర్యం ఎలా ఉంది.. వంటి అంశాలను గుర్తించాల్సి ఉంటుంది. పంట ఉత్పత్తుల ఎగుమతి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ల్యాండ్ రికార్డులు, ధరణి డేటా ఆధారంగా గణన

సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) వద్ద ఉన్న ల్యాండ్ రికార్డ్స్, ధరణి పోర్టల్‌లో నమోదైన భూముల వివరాల ఆధారంగా 2021–22లో వ్యవసాయ కమతాల గణన నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఆ ప్రకారంగానే ప్రక్రియను ప్రారంభించారు.

గణనకు అగ్రి 2021-22 యాప్

వ్యవసాయ కమతాల గణనకు అగ్రి 2021–22 యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా గణనను సాగించాలని నిర్ణయించారు. సీసీఎల్‌ఏ ల్యాండ్ రికార్డ్స్ ఆధారంగా ధరణి పోర్టల్‌లో ఉన్న డేటాకు అగ్రి 2021–22 యాప్‌ను అనుసంధానం చేసి ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామం యూనిట్‌గా ఈ ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది.

గ్రామాలు, కులాలు.. స్త్రీ, పురుషుల వారీగా గణన

గ్రామం యూనిట్‌గా వ్యవసాయ కమతాల గణనను నిర్వహిస్తారు. కులాల వారీగా, స్త్రీ, పురుషుల వారీగా ఈ గణన ఉంటుంది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మిగిలిన కులాలను ఇతరుల కింద, స్త్రీ, పురుషులు వేర్వేరుగా వారికి ఉన్న భూముల వివరాలను సర్వే నంబర్లవారీగా గణన చేస్తారు. ఆయా రైతులు స్థానికంగా ఉంటున్నారా.. ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారా.. ఇతర ప్రాంతాల్లో కూడా భూములు ఉంటే డూప్లికేషన్ గాకుండా ఆయా భూములను కూడా ఒకేచోట గణన అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భూములు, అటవీ భూములు, సాగుకు అనువైన భూములు, అనువు కాని భూములు, పశువులకు మేత భూములు, భవన నిర్మాణాలు కలిగి ఉన్న భూములు, రహదార్ల కింద ఉన్న భూముల వివరాలు కూడా గణనలో చేర్చుతారు. నీటి పారుదల, వర్షాధార వంటి భూముల వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

మున్నేరుపై మరో మూడు చెక్‌డ్యాంలు!

రూ.30 కోట్లతో ప్రతిపాదనలు


చెక్‌డ్యాంల నిర్మాణానికి కొలతలు తీస్తున్న అధికారులు (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలో ప్రవహిస్తున్న మున్నేరు వాగుపై మరో మూడు చెక్‌డ్యాంలు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జలవనరుల శాఖ అధికారులు రూ.30 కోట్ల అంచనాతో చెక్‌డ్యాంల నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి పంపించారు. జలవనరుల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ 10 రోజుల కిందట వచ్చి చెక్‌డ్యాంల నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించి సాధ్యాసాధ్యాలపై ఆరాతీశారు. ఆయన చేసిన సూచనలకు అనుగుణంగా జిల్లా అధికారులు అంచనాలు తయారు చేశారని, తీవ్ర వరదను సైతం తట్టుకుని ఉండేలా నిర్మాణాలు రూపొందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఓ అధికారి తెలిపారు. నగరంలోని పద్మావతినగర్, రంగనాయకులగుట్ట, దానవాయిగూడెం ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మున్నేరుకు ఇరువైపులా 14కిలోమీటర్ల మేర వరద తాకిడిని తట్టుకునేలా రక్షణ గోడలు (ఫ్లడ్ ప్రొటెక్ట్ వాల్స్) నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

టమాటాలు అమ్మి కోటీశ్వరుడైన రైతుకు సన్మానం


మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న రైతులు

నేలకొండపల్లి: టమాటాలు అమ్మి కోటీశ్వరుడైన మహిపాల్‌రెడ్డిని రాజేశ్వరపురం రైతులు ఘనంగా సన్మానించారు. మెదక్ జిల్లా కొడిపల్లి మండలంలోని మమ్మాడ్‌నగర్‌కు చెందిన రైతు బాన్సువాడ మహిపాల్‌రెడ్డి ఇటీవల టమాటాలు అమ్మి కోట్లు సంపాదించిన విషయం విదితమే. సదరు రైతు సాగులో అవలంబిస్తున్న మెళకువలు తెలుసుకునేందుకు మండలంలోని రాజేశ్వరపురం రైతులు అక్కడికి వెళ్లి వచ్చారు. రైతుల కోరిక మేరకు ఆదివారం రాత్రి రాజేశ్వరపురం గ్రామానికి రైతు మహిపాల్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దండా నరసింహారావు, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ వీరెల్లి నాగరాజు, రైతులు యలమద్ది లెనిన్, షేక్ సోందుమియా తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన బాతు!

- చెరువు నీటిలో మునిగి ఒకరు మృతి
- తృటిలో బయటపడిన మరొకరు..

అశ్వారావుపేటరూరల్: సరదాగా పక్షుల వేటకు వెళ్లిన గిరిజనులు అనుకోకుండా బాతు కోసం చెరువులో దిగారు. ఈ ఘటనలో ఒకరు చెరువు నీటిలో మునిగి మృత్యువాత పడగా, మరొకరు ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన నారం పెదమంగరాజు(32)తో పాటు మరో ఎనిమిది మంది కలిసి పక్షులు(పిట్టలు) వేటాడేందుకు మండలంలోని గంగారం గ్రామ సమీపంలోని చెరువు దగ్గరకు వెళ్లారు. పిట్టలను వేటాడే క్రమంలో చెరువులో నీటి బాతు కనిపించడంతో రాళ్లతో కొట్టారు. గాయపడి ఎగరలేక నీటిలో మునిగిపోతున్న ఆ బాతును పట్టుకునేందుకు పెదమంగరాజుతో పాటు అశోక్‌కుమార్ చెరువులోకి దూకారు. ఇద్దరు కలిసి దానిని పట్టుకునేందుకు యత్నించగా, ఈ క్రమంలోనే మంగరాజు ఈత కొడుతుండగానే ఒక్కసారిగా లోతు ప్రదేశంలోకి మునిగిపోతుండగా.. అశోక్‌కుమార్ కాపాడేందుకు పట్టుకున్నాడు. ఇతను కూడా నీటిలో మునిగిపోతుండటాన్ని గమనించిన తోటి గ్రామస్తులు అశోక్‌కుమార్‌ను రక్షించి ఒడ్డుకు తీసుకురాగా నీళ్లు తాగి అస్వస్థతకు గురికావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాని మంగరాజు మాత్రం నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దాంతో తోటి స్నేహితులు సుమారు రెండు గంటల పాటు చెరువు నీటిలో గాలించి పెద మంగరాజు మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికు తరలించారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు స్థానిక ఎస్సై పి.శ్రీకాంత్ వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో నిండు గర్భిణి మృతి

- ఈ నెల 11న ఆస్పత్రిలో గర్భిణిని చేర్చిన కుటుంబ సభ్యులు
- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం: సూపరింటెండెంట్


రుత్తుబాయి మృతదేహం

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని మాతా శిశు ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి ఎనిమిది నెలల గర్భిణి.. కడుపులోని బిడ్డతో సహా మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే గర్భిణి ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఇతర ఆరోగ్య సమస్యలతోనే ఆమె చనిపోయిందని వైద్యులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. నెల్లూరు జిల్లా పామూరుకు చెందిన గోస నర్సింహులుకు టేకులపల్లి మండలం ముక్కంపాడుతండాకు చెందిన రుత్తుబాయి (25)తో గతేడాది వివాహమైంది. ప్రస్తుతం రుత్తుబాయి ఎనిమిది నెలల గర్భిణి. ఆమెకు ఎక్లామేషియా (హైబీపీ–160/100) వ్యాధి వచ్చింది. దీంతో ఈ నెల 11వ తేదీన అర్ధరాత్రి రుత్తుబాయిని కుటుంబ సభ్యులు మాతా శిశు ఆస్పత్రిలో చేర్పించారు. పదిరోజులుగా చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో రుత్తుబాయి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని రెండో గేట్ నుంచి పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైద్యుల నిర్లక్ష్యమేనంటూ..

ఈ నెల 11వ తేదీన ఆస్పత్రిలో చేర్పించిన తమ బిడ్డకు సరైన వైద్య సేవలు అందించకపోవడంతోనే మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎప్పుడు చూసినా కేవలం బీపీ చెక్ చేసేవారని, బీపీ ఎక్కువగా ఉందని చెప్పి నామమాత్రపు గోళీలు ఇచ్చారని, కానీ, తల్లీ, కడుపులో ఉన్న బిడ్డ గురించి ఎలాంటి చికిత్స అందించలేదని ఆరోపించారు. శనివారం ఉదయం గర్భిణి పరిస్థితి బాగాలేదని చెప్పారని, ఆమె భర్తను పిలిపిస్తే ఆపరేషన్ చేస్తామని చెప్పారని, రాత్రి సమయంలో తమ బిడ్డ చనిపోయిందని రోదించారు. తమ కూతురు చనిపోయిన విషయం కూడా ఆలస్యంగా చెప్పారని, వైద్యులతో మాట్లాడుతుండగానే పోలీసుల సాయంతో మరో మార్గం నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన కూతురు మృతిచెందిందని రుత్తుబాయి తండ్రి భద్రు ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గర్భిణి ఎక్లామేషియా పేషంట్..

గోస రుత్తుబాయిని ఆమె తల్లి, మరొకరు ఈ నెల 11న ఆస్పత్రిలో చేర్చారు. ఆమె 32 వారాల గర్భిణి. ఆస్పత్రిలో చేర్చేందుకు స్థానిక ఆశకార్యకర్త, అంగన్వాడీ టీచర్‌ను వెంట తీసుకురావాల్సి ఉన్నప్పటికీ వారు తీసుకురాలేదు. అయినా డ్యూటీ డాక్టర్లు పరీక్షించి ఆమెకు 160/100 బీపీ ఉందని, ఆమె ఎక్లామేషియా పేషంట్ అని, దీంతో ఆమెకు ఫిట్స్ వస్తాయని నిర్ధారించారు. హైరిస్క్ కేసు అని స్పష్టంగా చెప్పాం. కుటుంబ సభ్యుల కోరిక మేరకే చేర్చుకున్నాం. బీపీ కంట్రోల్‌లో లేకపోవడంతో శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. అయినా వైద్యుల నిర్లక్ష్యమేనని భావిస్తే ప్రొఫెసర్లతో విచారణ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–బోడ కుమారస్వామి, ఆస్పత్రి సూపరింటెండెంట్

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి


హరీశ్ (ఫైల్)

కొణిజర్ల: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన కొణిజర్ల సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పల్లిపాడుకు చెందిన ఇమ్మడి హరీశ్ (24) కొణిజర్లకు వ్యక్తిగత పనినిమిత్తం వచ్చి తిరిగి పల్లిపాడు వెళ్తున్నాడు. కొణిజర్లకు చెందిన కనకంటి రాములు బైక్‌పై పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆ ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టిన హరీశ్ రోడ్డుపై ఎగిరిపడ్డాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న మరో గుర్తు తెలియని వాహనం హరీశ్ పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కమే మృతిచెందాడు. మరో వాహనదారుడు రాములుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు అవివాహితుడు. మృతుడి తండ్రి ఇమ్మడి కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శంకరరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ఖమ్మం మార్చురీకి తరలించారు.

నెలరోజుల్లో అమెరికా పయనం

పల్లిపాడుకు చెందిన ఇమ్మడి కృష్ణ, లక్ష్మి దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. కూతురుకు వివాహం కాగా కుమారుడు హరీశ్ ఇటీవలే బీటెక్ పూర్తి చేసి అమెరికా వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. వీసా ప్రక్రియ పూర్తయి వచ్చే నెలలో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఆదివారం తల్లిదండ్రులతో కలిసి సాయంత్రం వరకు చేనులో పనిచేసిన హరీశ్ అనంతరం ద్విచక్రవాహనంపై కొణిజర్ల వచ్చి తిరిగి ఇంటికి వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో అతడి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కట్టుకాసారాం గ్రామానికి చెందిన రాములు మరొకరు కలిసి బైక్‌పై ఆదివారం నేలకొండపల్లి నుంచి ఇంటికి తిరిగి వెళ్తున్నారు. కొత్తకొత్తూరు సమీపంలో బైక్ అదుపుతప్పి రహదారిపై పడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుతాస్పత్రికి తరలించి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న వెదురుకలప స్వాధీనం


కలపను చూపుతున్న అటవీశాఖ అధికారులు

మధిర: కల్లూరు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా జజ్జూరుకు రెండు ఆటోల్లో తరలిస్తున్న వెదురు కర్రలను మధిర రేంజ్ అటవీ శాఖ అధికారులు ఎర్రుపాలెం మండలం రామన్నపాలెం వద్ద శనివారం రాత్రి పట్టుకున్నారు. ఒక ఆటోలో రూ.20,645, మరో ఆటోలో రూ.25,298 విలువ చేసే వెదురు కలపను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారని, ఆటోలను సీజ్ చేశామని ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయలక్ష్మి ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. దాడిలో బీట్ అధికారులు సురేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు


చెట్టును ఢీకొట్టిన కారు

కొణిజర్ల: అదుపుతప్పి కారు చెట్టును ఢీకొట్టడంతో ఐదుగురు వ్యక్తులు గాయపడిన ఘటన కొణిజర్ల సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టీడీపీ వైరా మండల అధ్యక్షుడు చెరుకూరి చలపతిరావు మరో నలుగురు కలిసి కారులో ముదిగొండ మండలంలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు మీద ఉన్న భారీ గుంతను తప్పించబోయి కారు అదుపుతప్పి వేగంగా రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న చెరుకూరి చలపతిరావుకు కాలు విరగ్గా, వైరాకు చెందిన కొండపనేని రామారావుకు తలకు తీవ్ర గాయమైంది. వారితో పాటు వైరాకే చెందిన కొండపనేని నరసింహారావు, చెరుకూరి నరసింహారావు, మరో మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వారిలో రామారావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

ముగ్గురికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

పెనుబల్లి: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని కుప్పెనకుంట్ల వద్ద గుంటూరుకు చెందిన పి.వీరారెడ్డి తన కారులో మరో ముగ్గురు వ్యక్తులతో భద్రాచలం వైపునకు వెళ్తున్నాడు. తెనాలికి చెందిన గోగినేని చంద్రశేఖర్ వీఎం బంజర్‌లోని తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి విజయవాడకు వెళ్తున్నాడు. మండలంలోని కుప్పెనకుంట్ల వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనగా ముగ్గురు గాయపడ్డారు. రెండు కార్లలోని బెలూన్లు తెరుచుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. భద్రాచలం వైపు వెళ్తున్న కారులో పి.వీరారెడ్డి, పి.వాణి, పి.మనీషా, పి.హృద్య ఉన్నారు. క్షతగాత్రులను పెనుబల్లి, తిరువూరు ఆస్పత్రులకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ, గుంటూరుకు తరలించారు. ఘటనా స్థలానికి వీఎం బంజర్ పోలీసులు చేరుకొని వివరాలను సేకరించారు.

కూలీకి వెళ్లి తనువు చాలించి..

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


శేషమ్మ (ఫైల్)

తిరుమలాయపాలెం: కూలి పనులకు వెళ్లిన తన భర్తతో కలిసి వెళ్లిన వివాహిత రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం నామవరం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రగడ్డకు చెందిన మల్లెల ఉపేందర్ సుతారి మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. పనులకు తోడుగా భార్య శేషమ్మ (40)ను తీసుకుని రోజూ నామవరం తీసుకెళ్లి వస్తుండేవాడు. ఆదివారం పనులు ముగిసిన తర్వాత ఇంటికి బయలుదేరగా రోడ్డుపై దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శేషమ్మ అక్కడికక్కడే మృతి చెందగా ఉపేందర్ కాలు నుజ్జునుజ్జయ్యింది. క్షతగాత్రుడిని సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉపేందర్, శేషమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడున్నారు.


ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

చెట్టుకొమ్మను తప్పించబోయి..
లోయలోకి బస్సు!

- పాడేరు ఘాట్ రోడ్డులో విషాదం.. ఇద్దరి మృతి
- 28 మందికి గాయాలు..

సాక్షి, పాడేరు/పాడేరు రూరల్/సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: విశాఖ నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డులో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయిన ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం 34 మంది ప్రయాణికులతో బస్సు వెళుతోంది. పాడేరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఘాట్‌లోని వ్యూపాయింట్ వద్ద మలుపులో రోడ్డు పక్కన చెట్టు కొమ్మలను తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొట్టి వందడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం సూర్రెడ్డిపాలెంకు చెందిన నరవ నారాయణమ్మ(50), అల్లూరి జిల్లా పాడేరు మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన గిరిజనుడు సీసా కొండన్న(55) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అక్కడకు చేరుకున్నారు. ఆర్టీసీ, పోలీస్ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి పరామర్శించారు. అత్యవసర వైద్యం అవసరమైతే విశాఖ కేజీహెచ్ లేదా కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని, క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్య సాయం అందించాలని స్పష్టం చేశారు. పాడేరు ఘాట్‌లో ప్రమాదాలు నివారించేందుకు రవాణ శాఖ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు.

‘ఘోస్ట్’ చందా.. మార్గదర్శి దందా!

▶ మొదటి పేజీ తరువాయి
ఏ చిట్ ఫండ్స్ సంస్థలు, ప్రైవేటు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు చేయని రీతిలో వినూత్న రీతిలో మార్గదర్శి సాగిస్తున్న ఆర్థిక అక్రమాలకు ఇది తాజా నిదర్శనం.

ఇలా ఎందుకు చేశారంటే..

ఇక్కడ మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇలా ఎలా చేసిందనే సందేహం రావడం సహజం. ఎలా అంటే సుబ్రహ్మణ్యం ఆధార్ కార్డును తమ ఏజెంట్ల ద్వారా సేకరించి ఆయనకు తెలియకుండానే చిట్టీ గ్రూపులో చందాదారునిగా చేర్చింది. ఇలాంటి వారిని ‘ఘోస్ట్ చందాదారులు’ అని వ్యవహరిస్తారు. అంటే చందాదారులు లేకుండానే వారి పేరిట చిట్టీ గ్రూపుల్లో సభ్యత్వం కొనసాగిస్తారు. అయితే తాను చందాదారునిగా ఉన్నానని సుబ్రహ్మణ్యానికి తెలియదు కాబట్టి ఆయన చందా చెల్లించరు. ఆయన్ని ఎవరూ అడగరు కూడా. దాంతో అసలు విషయం బయటకు వచ్చే అవకాశమే లేదు. ఆయన పేరిట ఉన్న చిట్టీకి ప్రతి నెలా మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం చందా చెల్లించకపోయినా, చెల్లించినట్టుగా రికార్డుల్లో నమోదు చేస్తుంది. ప్రతి నెల చందాదారునికి వచ్చే డివిడెండ్‌ను మాత్రం సుబ్రహ్మణ్యం పేరిట తానే తీసుకుంటుంది. ఒక నెల సుబ్రహ్మణ్యం పేరిట చిట్టీ పాట పాడతారు. ఆ చిట్టీ పాట మొత్తం (ప్రైజ్‌మనీ) మార్గదర్శి యాజమాన్యం తమ సొంత ఖాతాలో వేసుకుంటుంది. అంటే రూపాయి చందా చెల్లించకుండానే.. ప్రతి నెల డివిడెండ్ మొత్తం తీసుకోవడంతోపాటు చిట్టీ పాట పేరిట ప్రైజ్ మనీ కూడా కొల్లగొడుతోంది.

ఇలా వెలుగు చూసింది..

మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సోదాల్లో భాగంగా సందేహం కలిగిన చందాదారులను స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు సంప్రదిస్తున్నారు. ఆ విధంగా సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యం చీరాలలో చిట్టీ గ్రూపులో సభ్యుడిగా ఉండటం ఏంటనే సందేహం వచ్చి అధికారులు సంప్రదించడంతో అసలు వ్యవహారం బట్టబయలైంది. మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 37 బ్రాంచీల పరిధిలో ఇలాంటి ఘోస్ట్ చందాదారులు భారీగా ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఘోస్ట్ చందాదారుల దందాతోపాటు చందాదారులను దురుద్దేశంతో అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ వారిని ఆర్థికంగా ఇక్కట్ల పాటు చేస్తోందని కూడా ఈ సోదాల్లో వెల్లడైంది. సీఐడీ అదనపు డీజీ సంజయ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఘోస్ట్ చందాదారులు, చందాదారులకు తెలియకుండానే వారిని ష్యూరిటీగా చూపించడం తదితర



మోసాలకు పాల్పడిన ఫిర్యాదులతో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఘోస్ట్ చందాదారులతో భారీగా అక్రమాలు

వ్యక్తులకు తెలియకుండానే వారి ఆధార్ నంబర్లు సేకరించి, చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చూపిస్తున్నారు. ఆ విధంగా ఘోస్ట్ చందాదారుల పేరిట డివిడెండ్లతోపాటు చిట్టీ మొత్తాన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ తమ ఖాతాల్లో జమ చేసుకుంటూ మోసానికి పాల్పడుతోంది. ఇది చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. ఇతర చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కూడా. ఎందుకంటే ఇతర చందాదారుల ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధంగా అంటే వారికి తక్కువ డివిడెండ్ వచ్చేలా చేస్తున్నారు. మరోవైపు ఘోస్ట్ చందాదారునికి ఎక్కువ వేలంపాట మొత్తం (ప్రైజ్‌మనీ) వచ్చేట్టుగా వేలం నిర్వహిస్తున్నారు.

వందకుపైగా ఫిర్యాదులు

చందాదారుల నుంచి ఫిర్యాదులు లేకుండానే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలను స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఖండించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పాల్పడుతున్న మోసాలపై పెద్ద సంఖ్యలో చందాదారులు పోలీసులు, సీఐడీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. మూడు రోజుల్లోనే దాదాపు వంద మందికిపైగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. కాగా, చందాదారులు పూర్తి వివరాలతో ఫిర్యాదులు చేసేందుకు సీఐడీ విభాగం ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్ 9493174065 కేటాయించింది.

అప్పుల ఊబిలోకి చందాదారులు

చిట్టీ గ్రూపు ప్రారంభంలోనే చందాదారుల నుంచి సంతకాలు తీసుకుని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఏకంగా చందాదారుల ఆస్తులను తమ పేరిట రాయించుకోవడం మార్గదర్శి చిట్‌ఫండ్స్ దారుణాలకు నిదర్శనం. ముందుగా తీసుకున్న సంతకాలను దుర్వినియోగం చేస్తూ ఓ చందాదారునికి కనీసం సమాచారం ఇవ్వకుండానే ఆయన్ను మరో చందాదారునికి ష్యూరిటీగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. దాంతో చిట్టీ పాట పాడిన చందాదారుడు వాయిదాలు చెల్లించ లేదు కాబట్టి, ష్యూరిటీగా పేర్కొన్న చందాదారుడు చెల్లించాలని రికార్డుల్లో చూపిస్తున్నారు. ఓ చిట్టీ పాట పాడిన చందాదారు ప్రైజ్‌మనీ తీసుకుని రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత మిగిలిన వాయిదాలు చెల్లించకపోతే.. ఆ చిట్టీ పాటను రద్దు చేసి సంబంధిత నెలకు కొత్తగా చిట్టీ పాట నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ దీన్ని మార్గదర్శి చిట్ ఫండ్స్ పట్టించుకోవడం లేదు. చిట్టీ వాయిదాలు చెల్లించలేని చందాదారులతో మాట్లాడి వారిని మరో చిట్టీ గ్రూపులో సభ్యులుగా చేరుస్తోంది. ఆ కొత్త గ్రూపులో డివిడెండ్‌తో పాత గ్రూపు వాయిదాలు చెల్లించవచ్చు అని చెబుతోంది. ఇలా ఒక చందాదారుని లెక్కకు మించి చిట్టీ గ్రూపుల్లో చందాదారుగా చూపిస్తోంది. దాంతో ఆ చందాదారు మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు భారీగా బకాయిలు పడేట్టు చేస్తోంది. అతి సామాన్య పూజారిని ఏకంగా 22 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చారు. మరో వ్యక్తిని ఏకంగా 60 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చేర్చినట్టు చెప్పారు. కానీ ఆయన ఏకంగా 90 చిట్టీ గ్రూపుల్లో చందాదారునిగా చూపించినట్టు సోదాల్లో వెల్లడైంది. ఇలాంటి అక్రమాలకు అంతే లేదు. ఆ చందాదారుడు ఓ చిట్టీలో పాటపాడినప్పటికీ అతి తక్కువ అంటే నామమాత్రంగానే ప్రైజ్‌మనీ పొందుతున్నారు. ఎంతగా అంటే రూ.50 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యుడైన ఓ చందాదారుడు రూ.46 లక్షలకు చిట్టీ పాట పాడితే ఆయనకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చేతికి ఇచ్చింది కేవలం రూ.20 మాత్రమే. మరో చందాదారుడు రూ.18 లక్షలకు చిట్టీ పాట పాడితే చేతికి వచ్చింది కేవలం రూ.200. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఇలాంటి అక్రమాలు కుప్పలు కుప్పలుగా బయటపడుతున్నాయి.

3 చోట్ల చీటింగ్ కేసులు నమోదు

చీరాల, అనకాపల్లి, రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై మూడు కేసులు నమోదు చేశారు. మూడు చోట్ల బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్)లతోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆ మూడు బ్రాంచిల మేనేజర్లను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారిని అరెస్టు చూపించి న్యాయస్థానంలో హాజరు పరుస్తామని సీఐడీ అదనపు డీజీ సంజయ్ తెలిపారు.

- ▶ సూళ్లూరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యానికి తెలియకుండా ఆయన్ను చీరాలలో చందాదారునిగా నమోదు చేసినందుకు చీరాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.
- ▶ అనకాపల్లికి చెందిన బి.వెంకటేశ్వరరావు నెలకు రూ.10 వేలు చొప్పున చందా చెల్లిస్తూ చిట్టీ గ్రూపులో చేరారు. 50 నెలల చందాలు చెల్లించిన తర్వాత ఆయన రూ.4,61,989కు చిట్టీ పాడారు. ఆయన ఎన్నిసార్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. ఎట్టకేలకు ఆయనకు రూ.20 మాత్రమే వస్తుందని చెప్పారు. మిగిలిన మొత్తం ఆయన ష్యూరిటీ ఇచ్చిన మిగిలిన చిట్టీల్లో సర్దుబాటు చేసినట్టు చూపారు. అసలు తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని చెప్పినా, బ్రాంచి మేనేజర్ వినిపించుకోలేదు. ఆయన సంతకాలు ఫోర్జరీ చేసిన పత్రాలు చూపించారు. ఆ కాపీలు కావాలని అడిగినా సరే ససేమిరా అన్నారు. దాంతో వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.
- ▶ కోరుకొండ విజయ్‌కుమార్ అనే చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాజ మహేంద్రవరం బ్రాంచిలో రూ.5 లక్షల చిట్టీ గ్రూపులో చేరారు. కొన్ని వాయిదాలు చెల్లించాక 2020 జూన్‌లో రూ.3 లక్షలకు చిట్టీ పాట పాడారు. కానీ ఆయనకు ప్రైజ్‌మనీ ఇచ్చేందుకు మార్గదర్శి చిట్ ఫండ్స్ మేనేజర్ తిరస్కరించారు. విజయ్ కుమార్ తన స్నేహితుడు మల్లి కార్జున రావుకు 2019లో ష్యూరిటీ ఇచ్చారని, ఆ స్నేహితుడు వాయిదాలు చెల్లించడం లేదు కాబట్టి ఆయనకు ప్రైజ్‌మనీ ఇవ్వమని చెప్పారు. అసలు మల్లికార్జునరావు చిట్టీ మొత్తం గడువు తీరనే లేదని తెలిసింది. తనను మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజ మాన్యం మోసం చేసిందని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.


మార్గదర్శి ఓ ‘నల్ల’ ఖజానా

- బ్రాంచి మేనేజర్ల పేరిట భారీగా బినామీ ఆస్తులు
- ఓ మేనేజర్ పేరిట రూ.100 కోట్ల ఆస్తి
- రూ.కోటి డిపాజిట్‌కు పైబడి వెయ్యి ఖాతాలు

మార్గదర్శి చిట్ ఫండ్స్ నల్ల కుబేరుల అడ్డా అన్నది బట్టబయలైంది. తవ్వేకొద్దీ అక్రమాలు పుట్టలు పుట్టలుగా వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో అక్రమ సంపాదనను దాచుకునేందుకు రామోజీరావు సృష్టించిన ఓ మినీ స్విస్ బ్యాంకు అని ఆధారాలతో స్పష్టమవుతోంది. ఉభయతారకంగా నల్లకుబేరులు, రామోజీరావు ఈ బ్లాక్ మనీ దందా సాగిస్తున్నారన్నది తేటతెల్లమవుతోంది. మరోవైపు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు చందదారుల సొమ్మును భారీగా తమ సొంతానికి మళ్లించుకున్న గుట్టు కూడా రట్టు అవుతోంది. శని, ఆదివారాల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో ఈ వ్యవహారం వెలుగు చూసింది. మనీ లాండరింగ్ జరుగుతున్నట్టుగా వెల్లడి కావడం గమనార్హం. రూ.కోటి కంటే అధికంగా చిట్టీలు వేసిన, అక్రమ డిపాజిట్లు చేసిన వారు దాదాపు వెయ్యి మంది వరకు ఉన్నట్టు ఇప్పటి వరకు గుర్తించినట్టు సమాచారం. వారి మార్గదర్శి లెడ్జర్ పుస్తకాల్లోగానీ, ఆ చందాదారులకు ఇచ్చిన పాస్‌బుక్‌లోగానీ వారి పాన్ నంబర్లు, ఆధార్ నంబర్లు నమోదు చేయనే లేదన్నది వెల్లడైంది. కొందరు చందాదారులను సీఐడీ అధికారులు పిలిచి విచారించగా వారికి అన్ని కోట్ల రూపాయలు ఏలా వచ్చాయన్నది చెప్పలేకపోయారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను ఆన్‌లైన్ ఖాతాల్లో ఎందుకు లింక్ చేయలేదని మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ప్రశ్నిస్తే వారు విస్మయకర సమాధానమిచ్చారు. ఈ అక్రమాల్లో మేనేజర్లు కీలక పాత్ర పోషిస్తున్నట్టు స్పష్టమైంది. రాష్ట్రంలోని ముఖ్య పట్టణంలోని ఓ బ్రాంచి మేనేజర్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. దాంతో రామోజీరావుతోసహా మొత్తం మార్గదర్శి చిట్ ఫండ్స్ యాజమాన్యం హడలెత్తిపోయింది. ఆ మేనేజర్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట దాదాపు రూ.100 కోట్ల వరకు ఆస్తులు ఉన్నట్టు వెల్లడైంది. ఈ మేనేజర్ చాలా మంది పెద్దలకు బినామీ అన్నది స్పష్టమవుతోంది. ఇలా పలువురు మేనేజర్లు ఉన్నట్లు సమాచారం. కాగా, కొందరు బ్రాంచి మేనేజర్లు చందాదారుల చందా మొత్తాలను తమ సొంతానికి వాడుకుంటున్నట్టు కూడా వెల్లడైంది. విశాఖపట్నంలో దీనిని నిర్ధారించారు. ఇతర బ్రాంచి కార్యాలయాల్లో ఆరా తీస్తున్నారు. పలు చోట్ల అవకతవకలకు సంబంధించి లెడ్జర్ ఖాతాలు, చిట్టీ పాటల మినిట్స్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా వార్తలు


నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానానికి రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లి, డైమండ్ హైట్స్ కాలనీకి చెందిన సువర్ణ రామేశ్వరపు, రమేష్ పవులూరి రూ.లక్ష విరాళం అందజేశారు. ముందుగా వారు ప్రధానాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుబంధ ఆలయాలను దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులకు విరాళం అందజేశారు. కాగా, బేబీ సినిమా ఆర్టిస్ట్ కిరాక్ సీత ఆదివారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.30,690


ట్రైనీ అధికారులకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ రామ్మోహన్

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చి డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 668 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,640, 275 మంది బోటింగ్ ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.11,050 ఆదాయం లభించింది.

అటవీ శాఖ సెక్షన్ అధికారి సందర్శన..
హైదరాబాద్ దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీకి చెందిన 15 మంది ట్రైనీ ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఫోర్స్ డైరెక్టర్ రాంమోహన్ ఆధ్వర్యంలో కిన్నెరసానిని సందర్శించారు. ఈ సందర్భంగా వైల్డ్‌లైఫ్ శాఖ చేపట్టిన ప్లాంటేషన్, జంతు సంరక్షణ తదితర అంశాలపై అధ్యయనం చేశారు. ట్రైనీ అధికారులకు యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

ఇక డిజిటల్ హెల్త్‌కార్డులు

- ‘ఆరోగ్య’ పాత కార్డుల స్థానంలో ఇవ్వాలని నిర్ణయం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- ఆరోగ్యమిత్రల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కార్డులు 7 లక్షలకు పైగానే..
- కొత్త కార్డులతో సేవలు సులువవుతాయని చెబుతున్న అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ప్రక్రియ మొదలైంది. ఇప్పటివరకు ఉన్న కార్డుల స్థానంలో కొత్తగా డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ నెల 12నుంచి కార్యక్రమాన్ని ట్రస్ట్ ద్వారా ప్రారంభించారు. ఇందుకోసం ప్రభుత్వ ఆస్పత్రులు, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోని ఆరోగ్యమిత్రల ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకం కింద పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ యోజన పథకం ద్వారా రూ.5 లక్షలు, ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.2 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో తెల్లరేషన్ కార్డుదారులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ఆహారభద్రత కార్డులు జారీ చేయగా వాటి లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. ఇప్పుడు పాత కార్డులన్నింటి స్థానంలో డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు.

ఆరోగ్య మిత్రల ద్వారా నమోదు
డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియలో ఆరోగ్య మిత్రల సేవలను వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు భద్రాద్రి కొత్తగూడెంలో ఐదు, ఖమ్మం జిల్లాలో 20 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఆహార భద్రత కార్డుకు ఆధార్ లింక్ చేయబడిన సెల్ నంబర్, ఇతర వివరాలను ఆరోగ్యమిత్రకు అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఆ తర్వాత వారం, పది రోజుల్లో డిజిటల్ కార్డు జారీ అవుతుంది. తద్వారా ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందడం సులువవుతుందని అధికారులు చెబుతున్నారు.



ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు నమూనా

ఏమిటి లాభం

కొత్తగా జారీ చేస్తున్న డిజిటల్ హెల్త్ కార్డుల వల్ల ఆస్పత్రుల్లో చికిత్స కోసం వెళ్లినప్పుడు రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తవుతుంది. ప్రస్తుతం ఉన్న కార్డులో కుటుంబ సభ్యుల వివరాలన్నీ ఉంటున్నాయి. డిజిటల్ కార్డు మాత్రం అందరికీ వేర్వేరుగా జారీ చేస్తారు. తద్వారా వివరాల నమోదు సులువవుతుంది. ఈ కార్డుపై బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ ఉండడం స్కైప్ చేయగానే వివరాలు వెల్లడై త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి చికిత్స ప్రారంభిస్తారు.

1,584 రకాల వైద్యసేవలు
ఇటీవల ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు విస్తృతమయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులకు బిల్లులు పేరుకుపోవడంతో చికిత్సతో పాటు శస్త్రచికిత్స చేయడానికి సుముఖత చూపడం లేదు. అయితే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం వైద్యసేవలు మెరుగయ్యాయి. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా 1,584 రకాల చికిత్సలు ఉచితంగా అందుతుండగా, ఇందులో ఆయుష్మాన్ భారత్ ద్వారా 642, ఆరోగ్యశ్రీ ద్వారా 942 వైద్యసేవలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ పథకాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తుండటంతో ఎక్కువ మంది ఈ పథకాన్ని ఎంచుకుంటున్నారు. అయితే, పాత కార్డులు కొన్నిచోట్ల పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యాన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 7,09,941 లక్షల పాతకార్డుల స్థానంలో డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,93,806, ఖమ్మం జిల్లాలో 4,16,135 కార్డులు ఉన్నాయి.

అందరూ డిజిటల్ కార్డులు తీసుకోవాలి



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ డిజిటల్ హెల్త్ కార్డులు ప్రతి ఒక్కరూ తీసుకోవాలి. ఆహారభద్రత కార్డుతో ఆధార్ లింక్ చేయబడిన సెల్ నంబర్, ఇతర వివరాలు సమీప ఆస్పత్రిలోని ఆరోగ్యమిత్రకు ఇస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత డిజిటల్ హెల్త్ కార్డు జారీ అవుతుంది.

–పి.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్, ఉమ్మడి ఖమ్మం జిల్లా మేనేజర్

ప్రజాసేవకే అంకితం అవుతా..

- రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు శ్రీనివాసరావు
- ‘గడప గడపకూ గడల’ కార్యక్రమం ప్రారంభం

కొత్తగూడెంరూరల్: ప్రజలకు సేవ చేయడమే రాజకీయమని, తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన జీవితాన్ని వారికే అంకితం చేస్తానని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు గడల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన కొత్తగూడెంలో ‘గడప గడపకూ గడల’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత సంతోషిమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 23వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. మహిళలు మంగళహారతులతో గడలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తాను పుట్టిన గడ్డకు ఎంతో కొంత తిరిగి ఇచ్చేందుకే ఇక్కడికి వచ్చానని తెలిపారు. జీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని, ఉన్నత చదువులకు తోడ్పాటుతోపాటు, అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పాల్వంచ సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, పటేల్, మోదుగు జోగారావు, అంజి, ఉజ్జీవరావు తదితరులు పాల్గొన్నారు.


‘గడప గడపకూ గడల’ కార్యక్రమంలో పాల్గొన్న గడల శ్రీనివాసరావు, తదితరులు

శిథిల క్వార్టర్లు కూల్చివేత..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కార్మికుల కోసం నిర్మించే క్వార్టర్లలో నాణ్యత లోపిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంపూర్‌లో సుమారు 20ఏళ్ల క్రితం నిర్మించినవి అప్పుడే శిథిలావస్థకు చేరడాన్ని ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. కాగా, ఈ క్వార్టర్లలో నివసించే పరిస్థితి లేకపోవడంతో యాజమాన్యం కూల్చివేయిస్తోంది. అయితే, 60ఏళ్ల క్రితం కట్టిన క్వార్టర్లు ఇంకా బాగానే ఉండడంతో చిన్న చిన్న మర్మమతులు చేసి కార్మికులకు కేటాయిస్తున్నారు. కానీ 20ఏళ్ల క్రితం కట్టిన క్వార్టర్లను కూల్చివేయించాల్సి రావడానికి అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా, కొత్తగూడెం ఏరియాలో జీకే ఓసీలో బొగ్గు నిక్షేపాలు నిండుకోవడంతో వీకే-7 ఓసీ విస్తరణకు నిర్ణయించారు. ఈమేరకు ఏరియా వర్క్‌షాప్, జీఎం కార్యాలయం, ఇతరత్రా పనులను రూ.8కోట్లతో చేపట్టనుండగా అధికారులు ఇటీవల శంకుస్థాపన చేశారు. ఈ పనులు చురుగ్గా సాగుతుండగా ఏ ఆధికారి కానీ డైరెక్టర్ కానీ పరిశీలించిన దాఖలాలు లేకపోవడంతో గౌతంపూర్ క్వార్టర్ల పరిస్థితే కొన్నాళ్లకు ఎదురవుతుందని చెబుతున్నారు. ఇకనైనా పనులు నాణ్యతగా సాగేలా అధికారులు పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయమై జీఎం(సివిల్) సూర్యనారాయణను వివరణ కోరగా గౌతంపూర్ క్వార్టర్ల విషయంలో కొన్ని నిర్మాణాలు సరిగ్గా జరగలేదని.. కానీ ప్రస్తుత నిర్మాణాలను మాత్రం నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.


గౌతంపూర్‌లో శిథిల క్వార్టర్లను కూల్చుతున్న దృశ్యం

అమిత్ షా సభను విజయవంతం చేయండి

గోవా ఎమ్మెల్యేలు ప్రేమేంద్ర సేత్, జయప్రకాశ్

ఖమ్మం మామిళ్లగూడెం : ఈనెల 27న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరవుతారని, సభను జయప్రదం చేయాలని గోవా రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు ప్రేమేంద్ర సేత్, కేదార్ జయప్రకాశ్‌నాయక్ కోరారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తెలంగాణ కూడా ఉందని, ఎమ్మెల్యే ప్రవాస యోజనలో భాగంగా పార్టీ బలోపేతం చేసేందుకే తాము ఇక్కడికి వచ్చామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని 341 బూత్ కమిటీలను సందర్శించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతామన్నారు. జిల్లాలో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని చెప్పారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు బరిలో ఉంటారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుంటోందని, ఈ నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారని జోస్యం చెప్పారు. బీజేపీలో సామాన్య కార్యకర్త సైతం ప్రజాప్రతినిధి కాగలరనడానికి తానే ఉదాహరణ అని ప్రేమేంద్ర సేత్ తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్, ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, నాయకులు డాక్టర్ శీలం పాపారావు, మన్‌కీబాత్ రాష్ట్ర కోఆర్డినేటర్ గెంటెల విద్యాసాగర్, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు దొడ్డా అరుణ, దిద్దుకూరి వెంకటేశ్వరావు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, డీకొండ శ్యామ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రేమేంద్ర సేత్, కేదార్ జయప్రకాశ్

బీజేపీ విజయానికి కృషి చేయాలి

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఒడిశా రాష్ట్రం బ్రహ్మపురి ఎమ్మెల్యే ఎల్‌బీ మహాపాత్రో అన్నారు. మండలంలోని ఏదులాపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. తెలంగాణాలో కుటుంబ పాలనకు ప్రజలు విసిగిపోయారని, డబుల్ ఇంజన్ సర్కార్ కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో విశ్వసించరని, తెలంగాణలో బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమని తెలిపారు. ఈనెల 27న జరిగే అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు టి.నరేంద్రరావు, మేక సంతోష్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, కె.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహాపాత్రో